కవితా కౌముది

# కాలపు నదిలో..

భువనచంద్ర

కాలపు నదిలో "దుర్ముఖి" కాలంగా కలిసిపోతే
మరో బుడగ పుట్టింది 'హేవిళంబి' నేనన్నది.
"రమ్మ హేవిళంబి నీకిదె మా స్వాతం..
ఈ భూమికి ఎన్నిసార్లు మరలి మరలి వొచ్చావో
ఒక్కసారి చెబితే మేమెంతో సంతోషిస్తాం.
..గతకాలపు గాధలు విని....ఎంతో ఆనందిస్తాం"
అని అంటే నేనూ చిరునవ్వులు నవ్వింది.
మౌనంగా నిట్టూర్చి... మాటలు మొదలెట్టింది!
ఎన్నిసార్లు వొచ్చానో....నీకెందుకు ఓ మనిషీ.
నువు పుట్టిన తరవాతా. ఈనాడే తిరిగొచ్చా!
మనుసుల్లో మార్పు చూసి మతేపోయి నిలుచున్నా
ఏం చెయ్యాలో తెలియక మౌనంగా కూర్చున్నా"...
అని అన్నది ఆ చిన్నది.
"చెప్పు హేవిళంబీ, ఆనాటి నీ అనుభవాలు.
..మరోసారి తిరగేసేయ్.. అప్పటి నీ జ్ఞాపకాలు"
"సరే సరే ఓ మనిషీ చెబుతా వినుకో మరీ.
నాడు మనిషి మనిషికీ అడ్డుగోడలసలు లేవు
నాడు మనసుకీ మనసుకి అగాధాలు లేనేలేవు
తేనెలోన తీపివుంది ఉప్పులోన ఉప్పు వుంది
చింతలోన పులుపు వున్నది మిర్చిలోన కారముంది
ఏమైనాయా రుచులూ ఈనాడు చెప్పవోయ్" అని అన్నది గడుసరి..
దుర్ముఖి సహోదరి
డయాబెటిక్ ధనవంతులు.. వెపచివురులెత్తికెడితె..
పూవులన్నీ భద్రంగా విపణి వీధి కెళ్ళాయి.
మామిడి ఆకాశంలో..ఉప్పు అయొడిన్ ఒడిలో. బెల్లం రసాయనంలో..
తేనె టెలీ మార్కెట్‌లో తప్ప
మాకు దొరకవమ్మ ఓ హేవిళంబీ... అయినా పరవాలేదు...
దిగులసలే లేనేలేదు
ఉగాదంటె తెలియదులే ఈ తరానికీ...
వచ్చిన ముప్పేం లేదు ప్రస్తుతానికీ.
కుంకుడుకాయల బదులూ..
షాంపూ సాచెట్లొచ్చాయ్
మినపగారెలకు బదులూ..
ఇటలీ పిజ్జా లొచ్చాయ్
పట్టుచీరలకు బదులూ...
చుడీదారులొచ్చాయీ
డేనైట్ నైటీలే పండగపూటైనా..
కాదంటే యుద్ధాలే మొగుడెంతటి వాడైనా.
ఎస్.ఎం.ఎస్ గోల తప్ప ఎవరూ వులకరు పలకరు
వొచ్చిన చుట్టాలనొదిలి వాట్సప్లో మునుగుతారు.
అమ్మమ్మలు తాతయ్యలు ఓల్డేజీ హోములో..
కుర్రగోలకంతులేదు టీవీ చానల్లో.
రెడీమేడు బట్టలంట రెడీ టు ఫ్రై కూరలంట
టూ మినిట్స్ నూడిల్సూ, ఫైవ్ మినిట్స్ బిరియాని
స్కైపీలో పెళ్ళిచూపులు ఈ మెయిల్ ఆహ్వానాలూ
ఆరునెలల మురిపాలూ ఆ పైన డైవోర్సులు
కులవృత్తులు చచ్చిపోయి కొత్తవృత్తులొచ్చాయీ
మంత్రి కొడుకు మంత్రే కూలోడి కొడుకు కూలీనే
ప్రజాస్వామ్యమేమైందో దేవుడికెరుక
పొగరుబోతులదె రాజ్యం పదవి వుంది గనక
ఏం చెప్పేదమ్మా ఈనాటి జనుల వైభవం
మనిషికన్నా యంత్రానికి విలువనిచ్చు దౌర్భాగ్యం"
నిట్టూరుస్తూ అన్నా హేవిళంబితో నేను..
గతకాలపు మాధుర్యం ఎలా మరిచిపోనూ!
"నువ్వన్నది నిజమేలే చూస్తున్నాగా!..
నాటి నేటి తేడాలను గమనముంచుకుంటూగా.
కుంపట్లను చూశాను పొట్టు పొయ్యి చూశానూ
కిరసనాయిలుతో మండేవిక్ స్టవ్వు చూశాను
గేస్ స్టవ్వూ సిలిండర్లు మిక్సీలూ గ్రైండర్లూ..

కుక్కర్‌లూ ఓవెన్‌లూ ఊహలోనే లేవుగా
అప్పటి సంగతివేరూ అప్పటి మనుషులు వేరూ
మంచినీళ్ళు అడిగితే మజ్జిగ ఇచ్చేవాళ్ళూ
ఆకలి అని నిలబడితే అన్నం పెట్టేవాళ్ళూ.
గూట్లో దీపం పెట్టి నోట్లో ముద్దెట్టుకునీ
పెనుచీకటి పడకముందె
కళ్ళు మూసుకునే వాళ్ళు
ప్రతి ఒక్కరు మరొకరిని
వరసలతో పిలుచుకుంటు
ప్రేమగ వుండేవారూ
పదుగురికై బతికెవారు..!
ఎవరి కులం వారిదే
ఎవరి మతం వారిదే
ఎవరెవరిని తిట్టలేదు
ఎవరిని ద్వేషించలేదు.
అప్పుడు నేనొచ్చినపుడు
హరికథలు బుర్రకథలు
తిరునాళ్ళూ నాటకాలు
ఎన్నెన్నో వుండేవీ
మనసుని కదిలించేవీ
మందిని మురిపించేవీ
ఏదో ఓ మంచిదారి ప్రజలకు చూపించేవి.
బస్సుల్లో రైళ్ళల్లో కూర్చునె చోటుండేదీ
ఎక్కడబడితే అక్కడ తాగునీరు దొరికేదీ
రైతుకి పట్టం కట్టిన రోజులు అవి నాయనా
స్వాతంత్రపు తొలిగాలులు ఇంకా వున్నై మనసున
దేశం కోసం త్యాగం చేశారెందరొ నాడూ
గురువులనూ విద్యార్థులు మన్నించారానాడు.
ఇప్పుడేమి జరుగుతోందొ చెప్పవయ్య సోదరా
నే చేసే మేలు నేను చేసి తీరుతాను దొరా.'' అని అన్నది హేవిళంబి..
చూపుని నాపై బరిపి.
నువు చెప్పిన పరిస్థితులు లేనేలేవీనాడూ
ఒకటొ రెండో వున్నా మన్నించే వాడెవడూ
కుమ్మరి సారెలులేవూ కమ్మరి కొలుములు లేవూ
హరికథలు కానరావు ఈనాడూ
రెడీమేడ్ వచ్చి వృత్తులన్నీ మూలపడ్డాయీ
కార్పేట్లు దివ్యంగా రాజ్యమేలుతున్నాయీ

కులమతాల వాదులాట హింసను సృష్టిస్తుంటే
రేపేమిటి అన్న భయం ఎదలో తాండవిస్తోందీ
అరవై సంవత్సరాల మార్పునేమి చెప్పనూ
మనుషులలోపల దాగిన గుట్టునేమి విప్పనూ
అని అన్నె దైన్యంగా కన్నులు వర్షిస్తుంటే
నిలబడ్డా మౌనంగా నా గుండెలు మండుతుంటె.
అనునయంగ నన్ను చూసి నాతొ అన్నది ఆమె
కన్నులతో కురిపిస్తూ ఏం ప్రేమ.
''విచారానికెందుకోయి చోటిస్తావూ
చెయ్యాల్సిన పనిని మరిచి రోదిస్తావూ?
గతకాలపు ఘనతలనే తలుచుకుంటు వుంటావా
మారే కాలం తెచ్చే మార్పుని తలదొల్చవా
నువ్వన్నది నిజమే గతమెప్పుడు మధురమే
గతమెన్నడు తిరిగిరాదు అను మాటా సత్యమే!
ఏమి ఏమి కావాలో ఏతరానికాతరం
తనే తెలుసుకుంటుంది సమకూర్చుకుంటుందీ
మంచిచెడుల తేడాలని తానే గుర్తిస్తుందీ
కార్డులతో ఆగిపోతే సెల్‌ఫోనులు వచ్చేవా..
జట్కాలతో ఆగిపోతె విమానాలు ఉండేవా
మనిషి ఆయుః ప్రమాణం నేడెంతో పెరిగిందీ
సాంకేతిక పరిజ్ఞానం వెయ్యింతలు అయ్యిందీ
భారతదేశపు యువత ప్రపంచాన్నె గెలిచిందీ
ఖండాలన్నింటిలోన తన ఉనికిని చాటుకుంది.
తాత్కాలిక ప్రలోభాలు అడ్డుకట్ట వేసినా
విచక్షణతో ముందు కెడితె ప్రగతి సాధ్యమవుతుందోయ్
భయపడకోయ్ ఓ మనిషీ మీ వెంటే నేనుంటా
మీరేసే ప్రతి అడుక్కి మీ సాక్షిగ నేనుంటా
గతకాలపు భజనమాని మార్పుకు వెల్‌కం పలుకు
రాబోయే విజయాలకు నేడే నవ్వులు చిలుకు
అన్యాయం జరుగుతుంటె నిర్భయంగ ఖండించూ
పొంగెత్తే యువశక్తికి చేయూతని అందించూ.

***



# జాబిల్లి చేవ్రాలు

డా.కె.గీత

ఆకాశపు కొలను లో
అరవిరిసిన జాబిల్లి-
శీతల చంద్రోదయానికి
అలల మేఘాల చేవ్రాలు-
రగిలే సాయంత్రపు
దు:ఖిత మానసానికి
తడి కన్నుల
రెప్పల్ని ముద్దాడి
ఎవరో ఓదార్పుగా
గగన వీధిన
వేళ్లాడదీసిన
దరహాస ప్రేమలేఖ
ఈ నిండు పున్నమి జాబిల్లి-
ఎప్పటిలా అందాల
సాయంత్రాన్ని ముంచేసే
ముష్కర
మేఘ సమూహాల
బదులు
ఈ క్షణం కోసమే
జన్మ జన్మలుగా
నిరీక్షిస్తున్నట్లు

తన్మయంగా చుట్టుకున్న
పసి మబ్బు -
ప్రేమైక సంతకం
ఆకాశం నించి భూమ్మీదకు
పుష్పాలై రాలిపడ్తూన్న
సుతి మెత్తని చంద్ర కిరణాలు-
దిగ్భ్రమగా వీస్తున్న గాలి -
తనువెల్లా తడిమి
తెరలు తరలు గా తరలి వస్తూన్న
వెన్నెల పరిమళాలు-
ధవళ రాత్రి
చిరు వెలుతురు
ప్రసరించిన చోటల్లా
మొలకెత్తిన తన్మయం!
ఆసాంతం కళ్ల నింపుకోవడానికి
వెయ్యి వెన్నెల హృదయాలు చాలునా?!
ఈ సాయంత్రపు
మైమరపుకి
వేనోళ్ల పొగడగలిగిన
సృష్టిలోని భాషలేవైనా తగునా?!

★★★



# అతనెప్పుడు అంతే

డా.జడా సుబ్బారావు

అతనెప్పుడూ అంతే...
భూమికీ ఆకాశానికీ నిచ్చెనలు వేస్తుంటాడు...!
చూపుల్తో శూన్యంలోకి శూలాల్ని
గుచ్చుతుంటాడు...!
ఊరేదో తెలియదు
పేరేంటో తెలియదు
సృష్టికి తానే కర్తనైనట్లు
తనలో తానే మురిసిపోతుంటాడు...!

జీవితసారాన్ని
అమాంతం ఇముడ్చుకున్న
అనుభవ కాసారంలా
అమాయకంగా నవ్వుతుంటాడు...!
అట్టలు కట్టిన జుట్టు
అతుకులతో నిండిన బట్టలు
రీసైక్లింగ్ చేయడానికి తెచ్చినట్లుగా
చుట్టూ పెట్టుకున్న గోతాం మూటలు
ఖాళీసీసాలు... వాటర్ బాటిళ్ళు
ఒక్కసారి దులిపితే
సృష్టిలోని మలినమంతా
బయటపడుతుందేమో అన్నట్లున్న గొంగళి అతని
చిరునామా చెప్పకనే చెప్పేస్తుంటాయి...!

కనబడిన మెట్లతోనే అతని చుట్టరికం పనికిరాని
అట్టలతోనే అల్లుకున్న జీవితం చెత్తకుండీల్ని గుత్తకు
తీసుకున్నవాడిలా విసిరేసిన ఆకుల కోసం ఆబగా
వెతుకుతాడు...!
దొరికిన నాలుగు మెతుకుల్నే
పంచభక్ష్య పరమాన్నంగా ఆరగిస్తాడు...!
మూలగా ముడుచుకుని
ముల్లోకాలనూ
ముసిముసినవ్వులతో బంధించాలని చూస్తాడు...! అతని
జీవితం వెనుక ఏదో సందేశం

అయినా
అతని బ్రతుకే తీరని ఒక సందేహం
ఆశకీ శ్వాసకీ నడుమ
ఒంటరి వానచుక్కలా
రాలిపోయే కట్టెముక్కలా
అతనెప్పుడూ అంతే...
భూమికీ ఆకాశానికీ నిచ్చెనలు వేస్తుంటాడు...! చూపుల్తో
శూన్యంలోకి శూలాల్ని గుచ్చుతుంటాడు...!

★★★



# కనురెప్పల కాపలా

ఉమా నూతక్కి

తాను నువ్వుగా నువ్వు తానుగా మారడమన్న
అస్తిత్వాల బదిలీనే ప్రేమనుకుంటే
మరి ఇక మనిషికి ప్రేమ నిషిద్ధమే-
ఒకరినొకరం కొల్లగొట్టుకోవడంలో
ఒక ఖాళీతనం మొదలవుతుందన్న నిజం
అస్తిత్వాలు మిథ్యగా మిగిలి
మనసు డొల్లగా మారినప్పుడే బయటకొస్తుంది!
నిన్ను నీలా నిలబెట్టుకుంటూ
తనని తనలా స్వీకరించడమే ప్రేమ!

ఆరాధన అపరిమితమవ్వటమే కాదు,
అవసరమైన చోట తన పహారా
అపరిచితంగా ఉండిపోవాలి గాని,
భావ బంధనాల పంజరంలో
ఒకరికొకరు నిలువరించే వేటని
ఒక ఆటగా మార్చుకోకూడదు!



నీకు తానూ తనకు నువ్వూ
వీడలేని బంధమవ్వాలి కానీ -
నవ్వులని లుప్తంగా రువ్వే భయమై
మనసు చుట్టూ ముళ్ళతీగలాంటి బంధనమై
గుండె లోపలి రుధిరాన్ని కళ్ళ నీరంగా మార్చుకుంటూ
కడలి పుట్టుకకి అరువిచ్చేలా ఉండకూడదు!

తన రక్షణ వ్యాపితమవ్వని క్షణాలేవీ నీకు
నీ మనసంటని కాల విహంగాలు తనకూ
తారసపడకపోవడంలోనే
ఒకరికొకరెంతో వెల్లడవ్వాలి!
ఒకరి కనుపాపకొకరు కనురెప్పలుగా మారిపోవాలి,
అప్పుడు అలాగే మారి పోవాలి,
కనురెప్పల కాపలా ఎరుగని కనులంటూ ఉన్నాయా మరి?

***

# ఒక జ్ఞాపకాన్ని

డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

నిన్నటి దాకా నేను:-

నిలబడిన నిలువెత్తు ఆత్మ విశ్వాసాన్ని
అల్లుకున్న బంధాలకు పందిరిని
అనురాగమై కురిసే జల్లుని
ఆశలు చుట్టుకున్న ఆకాశాన్ని.

నేడు నేను :-

విరిగి పడిన సాగర కెరటాన్ని.
విధి విసరిన వడిసెల రాయి తగిలి
విలవిల లాడుతున్న విహంగాన్ని.
సెలవంటూ గడప దాటే ఆత్మీయ అతిథి ని.

అద్దె ఇల్లు వదిలే వేళ ఆగడానికి కుదరదు.
సర్దు కోవడానికి సామానేమీ లేదు.
ఆగమనం, నిష్క్రమణం
రెండు ఒంటరి ప్రయాణాలే.

రేపు నేను :-

గోడ మీది చిత్ర పటాన్ని
కేలండర్ లో ఒక తేదీని
ఫోటో ఆల్బం లో ఒక పేజీని
మదిలో మెదిలే ఒక జ్ఞాపకాన్ని.

***



# మహానుభావులు

లాస్యప్రియ కుప్పా

కొన్ని పగళ్ళకు వెలుగులుండవు
చీకటి దాటలేని కిరణమేదో
రగిలిపోతుంది,
కొన్ని మేఘాలలో తడి తేలదు
కురవలేని బరువుతో
తేలిపోతుంది,
కొన్ని గాయాలకు మందు వుండదు
ఆరని మంటతో
మిగిలిపోతుంది,
కొన్ని రాగాలకు స్వరాలుండవు
తీరని వేదనతో
ఎదవీణ మోగుతూనే వుంటుంది,
కొందరంతే -
కిరణాన్ని చూడలేక
భారాన్ని మోయలేక
గాయాన్ని దాచలేక
శోకాన్ని మింగలేక
తమలో తాము తప్పిపోతారు!
కొందరింతే
మనుషులుంటారు
బతుకులుండవు
తృణాలుగా కణాలుగా రాలిపోతారు !!

***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

అప్సరాంగనలేగుచునంబరమున
ఆగి తనివార గని విస్మయమ్మునొందు
చిరదమరవిభూతినెసగు సీమ యిద్ది
ధరణి గళముననిడు హారతరళమిద్ది

గగనమును తాకు శిఖర శృంగమ్మునుండి
జాలువారుచునిలచేరు మేలిముసుగు
నందనోద్యానవనమును జ్ఞప్తి చేయు
దరవికస్వర కుసుమితోద్యానవనము

ఈ మహాద్భుత రసమయ సీమ యందు
కలసి నడయాడు భాగ్యము కలిగె మనకు
జీవితమ్మునకర్థమీ చిన్న ఘడియ
ఎన్నొ జన్మల సార్థక్యమీ క్షణమ్ము

గగనముననొప్పు సాంధ్యరాగముల గనుచు
తారలు మెరయు దివ్యరోదసిని గనుచు
నిండువెన్నెలనొడలెల్ల నింపుకొనుచు
పరవశించిన చాలును ప్రాణమేల?

ప్రమదమన్నార్జించు సంపదలు కాదు
మనసు నైశ్చల్యమానంద మార్గమౌను
ప్రకృతి, ప్రేమయు మదికి సాఫల్యమిచ్చు
చిత్తమునకనుపమ రససిద్ధినిచ్చు



చిత్రం: కె.రామ్మోహన్

COMMENTS